# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 119 VEKUVA SAMAYAM TELUGU DAILY

★ Mahabubnagar ★ Hyderabad ★ Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: మంగళవారం 19 మే 2026








**సమయం ప్రతినిధి:** భారత్–నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్–యూరప్ భాగస్వామ్యం మరింత కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్, యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భారత్–ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు.




**సమయం ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది.




**ఢిల్లీ, సమయం ప్రతినిధి:** రోడ్లపై నమాజ్ చేసే ముస్లింలకు ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక హెచ్చరికలు చేశారు. రోడ్లపై నమాజ్ చేయకుండా సంయమనం పాటించాలని, చట్టం అందరికీ సమానమేని లఖ్‌నవూలో సోమవారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు. 'రోడ్లున్నవి ప్రజల రాకపోకల కోసం. వారికి అసౌకర్యం కలిగిస్తే ఊరుకోం. ముస్లింలు జనాభాను నియంత్రించుకోవాలి' అని అన్నారు. 'ఉత్తర్‌ప్రదేశ్‌లోని రోడ్లపై నమాజ్‌లు చేయరా అని తరచూ కొందరు నన్ను అడుగుతుంటారు. అలాంటివి ఇక్కడుండవని చెబుతుంటాను. కావాలంటే వెళ్లి చూసుకోమంటాను. రోడ్లున్నవి ప్రజా రవాణా కోసం. ఎవరైనా రోడ్ల కూడళ్ల వద్దకు వచ్చి ట్రాఫిక్‌ను దిగ్బంధించవచ్చా? ప్రజారవాణాకు అంతరాయం కలిగించే హక్కు వారికి ఎవరిచ్చారు?. మరికొందరు అడుగుతుంటారు. తాము ఎక్కువ మంది ఉన్నప్పుడు ఇలా నమాజ్ చేయకుండా ఉండటం సాధ్యం కాదు కదా అంటారు. దానికి మా సమాధానం ఒక్కటే. మసీదుల్లో షిఫ్టుల ప్రకారం నమాజ్ చేసుకోండి.

# విస్తృత స్థాయిలో రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు చేపట్టాలి



**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** జిల్లాలో రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తరించేందుకు విస్తృత స్థాయిలో రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. మే 15 నుంచి జూన్ 15 వరకు నెల రోజుల పాటు నిర్వహించనున్న రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం మహబూబ్‌నగర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం రెండో అంతస్తులోని జిల్లా ఉపాధి కార్యాలయం గది నంబర్ 224లో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి జె. సువర్ణ రాజ్ మొదటి సభ్యత్వాన్ని స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు రెడ్ క్రాస్ సభ్యత్వాలను నమోదు చేసుకుని ఈ నెల రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రెడ్ క్రాస్ సభ్యత్వం స్వీకరించి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, భారత రెడ్ క్రాస్ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎల్.ఎన్.ఏ. నటరాజ్, కలెక్టరేట్ పరిపాలనాధికారి జె. సువర్ణ రాజ్, జిల్లా ఉపాధి అధికారి మైత్రి ప్రియా, కార్మిక శాఖ ఉప కమిషనర్ చంద్రశేఖర్, కోశాధికారి జగపతిరావు, నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీహరి, తిరుపతి రెడ్డి, డాక్టర్ సి. బాబుల్ రెడ్డి, జూనియర్ రెడ్ క్రాస్ సమన్వయకర్త అశోక్‌తో పాటు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.




**సమయం ప్రతినిధి:** కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది. ఎకో సెన్సిటివ్ జోన్(25–35 మీటర్ల పరిధి) లోపల ఉన్న చెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టగా.. చెట్ల నరికివేతపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో పర్యావరణ ప్రేమికురాలు కాజల్ మహేశ్వరి పిటిషన్ దాఖలు చేశారు. కేబీఆర్ పార్క్ హైదరాబాద్‌కు ప్రధాన 'గ్రీన్ లంగ్స్' అని.. ఎకో సెన్సిటివ్ జోన్‌కు రక్షణ కోరుతూ పిటిషన్ వేశారు. 2020 అక్టోబర్ 27న ఎకో సెన్సిటివ్ జోన్‌ను తగ్గిస్తూ నోటిఫికేషన్ జారీ అయ్యిందని.. పబ్లిక్ హియరింగ్ లేదని పిటిషనర్ ఆరోపించారు. ఎస్ఆర్‌డీపీ రోడ్డు ప్రాజెక్టుల కోసం ఎకో జోన్ కుదించారని అన్నారు.







# సంపాదకీయం

## పొదుపు సరే, విదేశీ మదుపులు ఏవీ?

'దేశ ఆర్థిక వ్యవస్థకు నానా సమస్యలు సంచితమవుతున్నాయి. దిగుమతి సుంకాలపై అమెరికాతో మన సంబంధాలు సజావుగా లేవు. అవి కలహాశీలంగా పరిణమిస్తున్నాయి. సకల కార్యకలాపాలకు విస్తరిస్తూ, విజృంభిస్తున్న కృత్రిమ మేధ సాంకేతికతను స్వంతంగా సమకూర్చుకోవడంలో మనం వెనుకబడి ఉండడమే కాకుండా తప్పుదోవలో కూడా ఉన్నాము. ఎన్నికలలో జయపతాక నెగురవేసే విషయమై ఎంతగా శ్రద్ధాసక్తులు చూపుతున్నారో అంతకంటే మిన్నగా విదేశీ పెట్టుబడిని మళ్లీ దేశానికి తీసుకువచ్చేందుకు దృష్టి పెట్టాలి, అందుకు దీక్షాదక్షతలు చూపాలి. ప్రైవేట్ పెట్టుబడి స్తబ్ధమైపోయింది. కారణమేమిటి? వ్యాపారరంగ క్షేత్రస్థాయి వాతావరణం అంతులేని కష్టనష్టాలకు మాత్రమే ఆస్కారమిచ్చేదిగా ఉన్నది. అడుగడుగునా కఠిన నిబంధనలు, దర్యాప్తు సంస్థలు వ్యాపారవేత్తలను అమితంగా భయపెడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వ్యాపార సౌలభ్యం ఎలా సాధ్యమవుతుంది? భారత ఆర్థిక వ్యవస్థ శక్తిసామర్థ్యాల పట్ల ఆశావాదులూ ఉన్నారు, నిరాశావాదులూ ఉన్నారు. అయితే ఈ ఇరువురినీ భారత్ ఒకేలా అసంతృప్తికి లోనుచేస్తోంది మనకు ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన స్టాక్ మార్కెట్ ఉన్నది. దానిని కాపాడుకునేందుకైనా మనం జాగరూకత చూపకపోతే ఎలా?'

దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరుతెన్నులకు తీవ్ర అభిశంసనే ఆ వ్యాఖ్యలు. ఆ వ్యాఖ్యలతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నానని ఒప్పుకుంటున్నాను. అమెరికాతో సన్నగిల్లిన సంబంధాలు, విదేశీ పెట్టుబడులను మళ్లీ ఆకర్షించవలసిన ఆవశ్యకత, వ్యాపార సౌలభ్యానికి సానుకూలంగా లేని పరిస్థితులు, దర్యాప్తు సంస్థల పాత్ర గురించి రుచిర్ శర్మ వ్యాఖ్యలతో విభేదించవలసిన అవసరమేమున్నది? ఆ విషయాలేవీ ప్రజల దృష్టికి రావడం లేదు. పార్లమెంటరీ, ప్రజా చర్చలలో వాటిని తెలివిగా ఉపేక్షిస్తున్నప్పుడు ప్రజలకు వాస్తవాలు ఎలా తెలుస్తాయి?

నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. రెండు రాష్ట్రాలలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆనంద డోలికలలో ఉండగా దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టనష్టాల నెదుర్కొంటున్న వాస్తవాన్ని ఆయన గుర్తించారు. ఆ కఠోర సత్యాన్ని ఆయన అసాధారణంగా ఒప్పుకున్నారు. ప్రభుత్వం చేసిన తప్పులు, చేయని ప్రజాహిత పనులకు సంభవించిన, ఇంకా సంభవిస్తోన్న ఎనలేని కష్టనష్టాలకు ఉపశమనంగా ప్రజలు త్యాగాలు చేయాలని ప్రధానమంత్రి అభిలషిస్తున్నారు. ఆ మేరకు పిలుపునిచ్చారు కూడా. వాస్తవాలు ఎంత కఠినంగా ఉన్నాయో చూడండి: ఇరాన్‌పై అమెరికా--ఇజ్రాయెల్ సంయుక్త యుద్ధం ప్రారంభమై ఈ నెల 31 నాటికి మూడు నెలలు పూర్తవుతాయి. యుద్ధం ఆగిపోయే సూచనలు కానరావడం లేదు; పశ్చిమాసియాలోని దేశాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ యుద్ధంలో పాల్గొంటూనే ఉన్నాయి; బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్లుగా ఉన్నది; రూపాయి మారకం విలువ డాలర్‌కు రూ. 95.70గా ఉన్నది. రూపాయి విలువ ఎన్నడూ ఇంతగా పతనం కాలేదు; అధికారికంగా వినియోగ ధరల సూచీ ద్రవ్యోల్బణం 3.5శాతం కాగా ఆహార ద్రవ్యోల్బణం 4.33శాతం; గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.913 కాగా కమర్షియల్ సిలిండర్ ధర రూ.3077 నుంచి రూ.3237 దాకా ఉంటోంది; డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 8.3శాతం; ఏప్రిల్--డిసెంబర్ 2025లో నికర విదేశీ పెట్టుబడి ఇలా ఉన్నది: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు-- 300 కోట్ల డాలర్లు (ఇది చాలా స్వల్పం) కాగా, విదేశీ సంస్థాగత పెట్టుబడులు 4.3 బిలియన్ డాలర్ల కంటే తక్కువ; 2025--26 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ మూలధన పెట్టుబడుల ప్రతిపాదనల మొత్తం విలువ రూ. 6.6 నుంచి 6.8 లక్షల కోట్లు; 2025--26లో బంగారం దిగుమతుల విలువ 7200 కోట్ల డాలర్లు; ఏడాదికి 50 రోజుల పని కల్పించే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసిన తరువాత పేద ప్రజలకు లబ్ధి చేకూర్చే వేతన ఉపాధి కార్యక్రమం ఏదీ అమల్లో లేదు.

ఈ సమస్యలన్నిటినీ అధిగమించడమెలా? ప్రస్తుత ఆపత్కాలాన్ని అధిగమించేందుకు చేయవలసిన వాటి విషయమై ఆయన నేరుగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అవేమిటో చూద్దాం. బంగారం దిగుమతులను నిలిపివేయాలి లేదా గణనీయంగా తగ్గించాలి? అన్ని విషయాలలోను పొదుపు పాటించి తీరాలి. ఇంధన వినియోగం, వంటనూనెలు, ఎరువులు మొదలైన వాటి వినియోగంలో ఆత్మసంయమనం వహించాలి. అనవసర దిగుమతులను పూర్తిగా నిరోధించాలి. ఇంకా ఇలాంటివే మరికొన్ని. మంచిదే. ప్రజలు పాటిస్తారు. కొన్ని విషయాలలో ప్రభుత్వ సూచనలు రాకముందే వారు వాటిని పాటిస్తున్నారని కూడా చెప్పవచ్చు. మరీ ముఖ్యమైన విషయమేమిటంటే ప్రధానమంత్రి తక్షణమే చేయవలసింది ఒకటి ఉన్నది: తన ప్రభుత్వ పనితీరును నిశితంగా విశ్లేషించుకోవడం. ఆత్మపరిశీలనతోనే అన్ని మంచి పనులు ప్రారంభమవుతాయి మరి.

అడ్డూ అదుపూ లేకుండా ఇంధన వినియోగానికి కారకుడుగా మొదట ప్రధానమంత్రినే చెప్పాలి. ఆయన ఇంచుమించు ప్రతి రోజూ ఢిల్లీ నుంచి సుదూర ప్రాంతాలలో ప్రాంభోత్సవాలకు లేదా కొత్త ప్రభుత్వ పదవీ ప్రమాణ స్వీకారోత్సవాలకు విమానంలో వెళ్లుతుంటారు (తిరిగి ఢిల్లీకి వస్తారు). ఆయన కాన్వాయ్ చాలా పొడవుగా ఉంటుంది. ఇప్పుడు దానిని కుదించారనుకోండి. ఇక ఆయన ఆర్థికమంత్రి దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత దుర్గతి గురించి ఒక్కసారి కూడా మాట్లాడలేదు (యూపీఏ ప్రభుత్వ హయాంలో అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ఒకటి భారత్‌ను నాలుగు బలహీన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా పేర్కొన్నదని ఆమె మహదానందంతో చెప్పుతుంటారు). 2013-14లో ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభానికి ట్యాపర్ టాంట్రమ్ (ఒక కేంద్ర బ్యాంకు- సాధారణంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్- తన ఆర్థిక ఉద్దీపనను తగ్గిస్తుందని లేదా పెంచుతుందని సంకేతం ఇచ్చినప్పుడు ఆర్థిక మార్కెట్లలో కనిపించే అస్థిర ప్రతిచర్య) దారి తీసిందని, యూపీఏ ప్రభుత్వం వెన్వెంటనే ప్రతిస్పందించి పటిష్ఠ చర్యలతో పరిస్థితిని చక్కదిద్దిందని ఆమె చెప్పనే చెప్పరు. స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేట్లే యూపీఏ ప్రభుత్వ సమర్థతకు ఒక తిరుగులేని నిదర్శనం.

## క్రీడల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుంది




**వనపర్తి. సమయం ప్రతినిధి:** క్రీడల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తూ... క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న యూత్ మరియు స్పోర్ట్స్ వారోత్సవాల సందర్భంగా జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వనపర్తిలో 2కే రన్ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ 2కే రన్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్యఅతిథిగా హాజరై అదనపు ఎస్పీ రాజేష్ మీనాతో కలిసి జెండా ఊపి రన్ ప్రారంభించారు. బాలుర జూనియర్ కళాశాల మైదానం నుంచి బస్ డిపో మీదుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానం వరకు ఈ 2కే రన్ సాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 99 డేస్ ప్రజా పాలనలో భాగంగా యువజన మరియు క్రీడల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడల పట్ల ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తూ, క్రీడల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు ఒక భాగంగా మారాలని సూచించారు. శారీరకంగా ఆరోగ్యంగా ఉంటే మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉంటామని, అందరూ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వనపర్తి జిల్లాలో బాక్సింగ్ స్పోర్ట్స్ క్యాంప్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఏ ఎస్ పి రాజేష్ మీనా మాట్లాడుతూ క్రీడలను అలవాటు చేసుకోవడం వల్ల శారీరకంగా దృఢంగా ఉండడం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఫిట్నెస్ కలిగి ఉండాలని తద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోగలమని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న యువజన మరియు క్రీడల వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా యూత్ మరియు స్పోర్ట్స్ వీక్, టూరిజానికి సంబంధించిన పోస్టర్లను కూడా ఆవిష్కరించారు. యూత్ మరియు స్పోర్ట్స్ వారోత్సవాల్లో భాగంగా ఈ వారం ప్రతిరోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి తెలిపారు. యువతలో స్కిల్ డెవలప్మెంట్, యూత్ పార్లమెంట్, స్వచ్ఛదనం మరియు పచ్చదనం, వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న యువతకు సన్మాన కార్యక్రమాలు వంటివి వారోత్సవాల రోజువారి కార్యక్రమాల్లో భాగంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ బాలాజీ నాయక్, అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణికి 92 ఫిర్యాదులు
## అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు - జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి





**రంగారెడ్డి, (సమయం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 92 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే వినతులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 32 ఫిర్యాదులు, ఇతర శాఖలకు చెందిన 60 ఫిర్యాదులు అందగా మొత్తం 92 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం కలెక్టర్ జనాభా గణన-2027 కార్యక్రమంపై అధికారులకు కీలక సూచనలు చేశారు. ఎన్యుమరేటర్లు ఇంటింటి గణన ప్రక్రియను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాకుల్లో ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఒక్క కుటుంబం కూడా మిగలకుండా పూర్తి స్థాయిలో వివరాలు సేకరించాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. సేకరించే సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేసి డిజిటల్ ఎంట్రీలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది ప్రజలకు జనగణన ప్రాధాన్యతను వివరించి సహకారం పొందాలని, నిర్ణీత గడువులోపు ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి (రెవెన్యూ), కిరణ్మయి (లోకల్ బాడీస్), జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్రూడ్ వార్.. సడలింపులు ముగించిన ట్రంప్.. 'రష్యా చమురు'పై తగ్గబోమంటున్న భారత్!

మొదటి పేజీ తరువాయి

అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో సరికొత్త చమురు యుద్ధం మొదలైంది. రష్యా ముడి చమురు కొనుగోళ్లపై భారత్‌తో పాటు పలు దేశాలకు గతంలో ఇచ్చిన తాత్కాలిక సడలింపుల గడువును పెంచకూడదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించారు. మే 16వ తేదీతో ఆ గడువు ముగిసిపోయింది. అయితే, ట్రంప్ సర్కార్ మినహాయింపులకు చరమగీతం పలికినప్పటికీ, దేశీయ ప్రయోజనాలే పరమావధిగా రష్యా నుంచి చమురు దిగుమతులను మునుపటిలాగే కొనసాగిస్తామని భారత్ స్పష్టం చేసింది.

ట్రంప్ మైండ్ గేమ్.. అక్కడ ఆంక్షలు.. ఇక్కడ ఊరట!

చైనా పర్యటన ముగించుకుని వాషింగ్టన్ చేరిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, తన ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ ద్వారా రష్యా చమురుపై సడలింపుల గడువును ముగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. రష్యాకు వెళ్లే ఆదాయ వనరులను దెబ్బతీయడమే దీని లక్ష్యమని వైట్ హౌస్ చెబుతోంది.

అయితే, ఈ ప్రకటన వెనుక ట్రంప్ పెద్ద పొలిటికల్ మైండ్ గేమే ఆడుతున్నట్లు అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికాలో నవంబర్‌లో రాబోయే మిడ్‌టర్మ్ ఎన్నికల నేపథ్యంలో దేశీయంగా గ్యాస్ ధరలు ఒక్కసారిగా గ్యాలన్‌కు వి4.50 దాటేశాయి. దీంతో ఓటర్ల ఆగ్రహానికి గురికాకూడదనే ఉద్దేశంతో 'ఫెడరల్ గ్యాస్ టాక్స్' (చమురు పన్ను) ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అలాగే రష్యాపై కఠినంగా ఉన్నట్లు బిల్డప్ ఇస్తూనే.. ఇటువైపు ఇరాన్ చమురు కొనే చైనా కంపెనీలపై ఆంక్షలు ఎత్తివేసేలా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో మాట్లాడటం గమనార్హం.

## ఉప్పల్ రింగ్ రోడ్డు మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ : ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల కారణంగా ఉప్పల్ రింగ్ రోడ్డు మార్గంలో నేటి నుంచి మూడు నెలల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. వరంగల్ వైపు వెళ్లే రహదారిని మూసివేయడంతో వాహనాలను జీఎస్ఐ, బీరప్పగడ్డ, ఉప్పల్ భగాయత్, ఓఆర్ఆర్ మార్గాలకు మళ్లించారు. ఉప్పల్, యాదగిరిగుట్ట బస్టాప్‌లను నల్లచెరువు కట్టకు మార్చారు. హబ్సిగూడ-నాగోల్ మార్గానికి ఎలాంటి ఆంక్షలు లేవు. భారీ వాహనాలను హయాత్‌నగర్, ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ మీదుగా మళ్లించారు. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు అలర్ట్. ఉప్పల్?నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు గాను ఉప్పల్ రింగ్ రోడ్డు పరిధిలో నేటి (ఆదివారం) నుంచి మూడు నెలల పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, రాచకొండ ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ప్రకటించారు. ఉప్పల్ సర్కిల్‌లో వరంగల్ వైపు వెళ్లే ప్రధాన రహదారిని ఆదివారం నుంచి తాత్కాలికంగా మూసివేయనున్నారు. నిర్మాణ సామగ్రి తరలింపు, పిల్లర్ల ఏర్పాటు పనుల దృష్ట్యా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా భారీ ఎత్తున దారి మళ్లింపులు చేపట్టారు. ఇందులో భాగంగా ఉప్పల్ సర్కిల్‌లో ఉన్న వరంగల్ బస్టాప్, యాదగిరిగుట్ట బస్టాప్‌లను తాత్కాలికంగా నల్లచెరువు కట్ట సమీపానికి మార్చారు.రామంతాపూర్ లేదా హబ్సిగూడ వైపు నుంచి వరంగల్ మార్గంలో వెళ్లే వాహనాలను జీఎస్ఐ వద్ద దారి మళ్లించనున్నారు. ఈ వాహనాలు పిస్తా హౌస్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ వెనుక భాగం నుంచి బీరప్పగడ్డ మీదుగా వరంగల్ జాతీయ రహదారిని చేరుకోవాల్సి ఉంటుంది. అలాగే నాగోల్, ఎల్బీనగర్ వైపు నుంచి వరంగల్ వెళ్లే వాహనాలు హయాత్‌నగర్ మీదుగా పెద్ద అంబర్‌పేట్ వద్ద ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు పైనుంచి లేదా సర్వీస్ రోడ్డు మార్గంలో ఘట్కేసర్ వద్ద వరంగల్ జాతీయ రహదారికి చేరుకోవాల్సి ఉంటుంది.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా క్రీడా & యువజన వారోత్సవాలు





**(సమయం ప్రతినిధి హైదరాబాద్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుండి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న యువజన క్రీడా వారోత్సవాలు కార్యక్రమాన్ని ఈ రోజు ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్ లో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ,స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి , క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి ,వీసీ & ఎండీ సోని బాలదేవి ,తెలంగాణ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రామ్ రెడ్డి ,యువజన & స్పోర్ట్స్ అథారిటీ బృందం ఘనంగా ప్రారంభించారు. 5 కిలోమీటర్ల వాకథాన్ ను జెండా ఊపి ప్రారంభించిన గౌరవ క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బీసీ మరియు రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ,స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి , క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి ,వీసీ & ఎండీ సోని బాలదేవి ,తెలంగాణ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రామ్ రెడ్డి ,యువజన & స్పోర్ట్స్ అథారిటీ బృందం...






## డిజైన్లు పరిశీలించిన ఎమ్మెల్యే



దేవరకద్ర నియోజకవర్గం : కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో నూతన మున్సిపల్ భవన నిర్మాణంకు సంబంధించి డిజైన్ లను దేవరకద్ర ఎమ్మెల్యే .జి. మధుసూదన్ రెడ్డి (GMR) పరిశీలన చేశారు. అనంతరం కొత్తకోట మండల PACS కార్యాలయంలో వరి కొనుగోలులకు సంబంధించి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, గుత్తేదారులతో మాట్లాడి, లారీలను సకాలంలో ఏర్పాటు చేయాలని ఆదేశించి, తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని అధికారులను ఎమ్మెల్యే జియంఆర్ ఆదేశించారు.

## ట్రోల్స్ కే సోషల్ మీడియా పరిమితమా...

హైదరాబాద్ : తెలంగాణ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ పార్టీకి బలమైన మీడియా ఉంది. ఒకవైపు ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు ప్రింట్ మీడియా కూడా సొంతంగా ఏర్పాటు చేసుకుంది. అయితే.. 2023 ఎన్నికల్లో ఈ మీడియా పార్టీని గట్టెంక్కించలేక పోయింది. అంతేకాదు.. గ్రామీణ ఓటరు నాడిని కూడా పట్టుకోలేక పోయింది. ఫలితం గా నగరాల్లో కొంత మేరకు ఫర్వాలేదని అనిపించినా.. గ్రామీణ స్థాయిలో పార్టీ పరాజయం పాలైంది. ఇక, వచ్చే ఎన్నికలకు సంబంధించి పార్టీ ఇప్పటి నుంచే కసరత్తు ముమ్మరం చేస్తోంది. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను బలోపేతం చేయడంతోపాటు.. నాయకులను కూడా ముందుండి నడిపించాలని ఇటీవలే సీనియర్ నాయకులకు పార్టీ సుప్రీం కేసీఆర్ తేల్చి చెప్పారు. ఇదే సమయంలో సోషల్ మీడియా ప్రస్తావన కూడా వచ్చింది. ప్రస్తుతం సోషల్ మీడియా చాలా యాక్టివ్‌గా ఉందని కేటీఆర్ చెప్పగా.. అదేం లేదని.. హరీష్ రావు వ్యాఖ్యానించినట్టు తెలిసింది. సోషల్ మీడియా కేవలం ట్రోల్స్, విమర్శలకే పరిమితం అవుతోందన్నది హరీష్ రావు వాదనగా ఉంది. అలా కాకుండా.. క్షేత్రస్థాయిలో ప్రజల నాడిని.. పట్టుకునే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందని హరీష్ రావు అభిప్రాయపడ్డారు. దీనిపై ఒకరిద్దరు నాయకులు.. ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రామీణ, పట్టణ స్థాయిలో ప్రజల నాడిని పట్టుకునే విషయంలో బీఆర్ ఎస్ సోషల్ మీడియా పెద్దగా వర్కవుట్ చేయడం లేదన్న వాదన వినిపించింది. ప్రస్తుతం రాజకీయంగా విమర్శలకు.. పోస్టులకు మాత్రమే పరిమితం అవుతోందన్నది ఎక్కువ మందిలో ఉన్న అభిప్రాయం. ఇది ఓటరు నాడిని పట్టుకునే ప్రయత్నం చేయడం లేదని కూడా చెబుతున్నారు. వాస్తవానికి ప్రధాన మీడియాతో పోల్చుకుంటే సోషల్ మీడియాకు రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇస్తుంటాయి.

## మండే ఎండలో మంచినీళ్లు అందించే కార్మికులకు 9 నెలల పెండింగ్ జీతాలు కలెక్టర్ వెంటనే ఇప్పించాలి



**(సమయం ప్రతినిధి) వనపర్తి:** ప్రగతిశీల మిషన్ భగీరథ కాంట్రాక్ట్ , ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (TUCI )ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కి కొత్తకోట మండలం గుంపుగట్టు దగ్గర మిషన్ భగీరథ స్కీములో పనిచేస్తున్న 18 మంది వర్కర్లు మండే ఎండల్లో కూడా జిల్లా ప్రజలకు మంచినీళ్లు అందిస్తున్న వర్కర్స్ కు 9 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇప్పించాలని, జీవో 60 ప్రకారం వేతనాలు పెంచాలని, గత సంవత్సరం బోనస్ 40 వేల చొప్పున ప్రతి ఒక్కరికి ఇప్పించాలని, ప్రతి నెల పిఎఫ్ జమ అయేవిధంగా, గత పెండింగ్ విఫిఎఫ్‌లో డబ్బులను జమ చేయించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా TUCI జిల్లా కార్యదర్శి పి. అరుణ్ కుమార్ కలెక్టర్‌తో మాట్లాడుతూ కార్మికులు పనిచేయాలంటే కనీసం తినడానికి డబ్బులు కావాలి ఇప్పటికే కిరాణంలో అప్పులు, బయట అప్పులు, వర్కర్స్ భార్యల దగ్గర ఉన్న బంగారాన్ని గిరివపెట్టి అరా కొర బ్రతుకులు వెలదీస్తున్నారు. ఇంకా అప్పు పుట్టని పరిస్థితిలో కార్మిక వర్గం జీవిస్తుంది. గత తొమ్మిది నెలలుగా కష్టాలతో జీవిస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రజలందరికీ మంచినీరు అందిస్తున్న చెల్లా కాంట్రాక్టర్ ధర్మారెడ్డి ,సబ్ కాంట్రాక్టర్ లింగారెడ్డి మాకు బిల్లు రాదని పేరుతో నెలల తరబడి జీతాలు ఇవ్వకుంటే ఎలా పని చేస్తారని ప్రశ్నించారు. అనేకసార్లు సబ్ కాంట్రాక్టర్, ఎస్. ఇలను అడిగిన ప్రయోజనం లేకపోయిం ది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్గా కాంట్రాక్టర్లతో మాట్లాడి పెండింగ్ జీతాలు ఇప్పించాలని లేని యెడల మంచినీళ్లు బందు పెట్టి సమ్మెకు పోవాల్సి వస్తుందని కార్మికులు చేయబోయే సమ్మెకి కాంట్రాక్టర్, ప్రభుత్వ యంత్రంగామే కారణం అవుతుందని హెచ్చరించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మిషన్ భగీరథ ఎస్సీ కి ఫోన్ చేసి వెంటనే సగం నెలలైనా పెండింగ్ జీతాలు క్లియర్ చేయాలని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం,విజయ్ జిల్లా నాయకులు ఉషన్న, వెంకటేశు ,శ్రీకాంత్, కురుమూర్తి ,రాములు ,వెంకటయ్య, శ్రీధర్ ,నిరంజన్, వంశి,బాబు పాల్గొన్నారు.

## కాన్వాయ్ తగ్గించుకున్న రేవంత్

హైదరాబాద్ : పశ్చిమాసియా యుద్ధం, హర్మూజ్ జల సంధి మూసివేత కారణంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో చాలా దేశాల్లో చమురు సంక్షోభం నెలకొంది. పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలు ఇప్పటికే ఇంధన ధరలు భారీగా పెంచాయి. క్యూబాలో అయితే లాక్‌డౌన్ ప్రకటించారు. భారత నౌకలకు ఇరాన్ అనుమతి ఇవ్వడంతో తరచుగా నౌకలు వస్తున్నాయి. అయితే చమురు ధరలు పెరగడం, నిల్వలు తగ్గడంతో ప్రధారి మోదీ కూడా ఇంధన పొదుపు పాటించాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇదే సమయంలో ఇంధన ధరలు పెంచారు. మోదీ పిలుపు మేరకు చాలా రాష్ట్రాల సీఎంలు తమ కాన్వాయ్ తగ్గించుకున్నారు. పొదుపు మంత్రం పాటిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. అయినా ప్రధాని పిలుపు, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్‌రెడ్డి కూడా తన అధికారిక కాన్వాయ్‌లో ముఖ్యమైన మార్పు చేశారు. ఇకపై నాలుగు వాహనాలతో మాత్రమే కాన్వాయ్ కదులుతుందని ప్రకటించారు. ఇంధన పొదుపు: ప్రధాని మోదీ పిలుపు నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు, మంత్రులు తమ వాహనాల వినియోగాన్ని తగ్గించాలనే సందేశం స్పష్టంగా ఉంది. సీఎం రేవంత్ ఈ సందేశానికి ఆచరణాత్మక రూపం ఇచ్చారు. కాన్వాయ్‌లో అధిక వాహనాలు ఉండటం వల్ల ట్రాఫిక్ జామ్, ప్రజల ప్రయాణాలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమస్యను గుర్తించి సీఎం సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి స్వయంగా ఉదాహరణగా నిలవడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగం మొత్తం మీద ప్రభావం చూపవచ్చు. ఇది 'పైనుంచి కిందికి' మార్పు తీసుకురావడానికి సహాయపడుతుంది. ప్రభుత్వ ఖజానాకు అదనపు భారం తగ్గడం, ఇంధన ఖర్చు తగ్గడం దీర్ఘకాలికంగా మంచి ఫలితాలనిస్తుంది. చిన్న చిన్న మార్పులు కూడా పెద్ద మొత్తంలో పొదుపు తెస్తాయి. ట్రాఫిక్ మధ్యనే ప్రయాణించడం ద్వారా సాధారణ ప్రజల జీవన విధానాన్ని ముఖ్యమంత్రి అనుభవించే అవకాశం ఏర్పడుతుంది. ఇది రాజకీయ నాయకులు ? ప్రజల మధ్య దూరాన్ని కొంతవరకు తగ్గించే అవకాశం ఉంది. ఈ నిర్ణయం అమలులో కొన్ని సవాళ్లు ఉండవచ్చు. ముఖ్యంగా భద్రతా పరమైన అంశాలు, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన కదలిక.

# ఉపాధి హామీ పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలి





## గ్రామాభివృద్ధికి ఉపాధి హామీ పథకం కీలకం

## జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని శ్రీపురం గ్రామంలో కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పరిశీలించారు. గ్రామ పరిధి లో చేపడుతున్న చెరువు పూడిక తీత పనులను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన కలెక్టర్ పనుల పురోగతి, నాణ్యతపై అధికారుల ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న వేతనాలు, పని పరిస్థితులు, తాగునీరు తదితర సౌకర్యాలపై వివరాలు సేకరించారు. గ్రామం నుంచి సుమారు 100 మంది ఉపాధి హామీ కూలీలు ఉదయం వేళలోనే పనులకు హాజరై పనులు ప్రారంభించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., గ్రామాభివృద్ధి పనులతో పాటు గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందని, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు పేద కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతిరోజూ అధిక సంఖ్యలో కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరై ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను తగ్గించడంలో ఉపాధి హామీ పనులు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, కూలీలు పనులకు క్రమం తప్పకుండా హాజరవుతూ ఆదాయాన్ని పెంచుకోవాలని కోరారు. చెరువుల పూడిక తీత పనులు గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని, ఈ పనుల ద్వారా చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు భూగర్భ జలాలు మెరుగుపడి రైతులకు సాగునీటి సమస్యలు తగ్గుతాయని తెలిపారు. పూడిక తీత వల్ల వ్యవసాయ భూముల సారవంతత కూడా పెరుగుతుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఇది బలాన్నిస్తుందని చెప్పారు. ఉపాధి హామీ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

పనుల అమలులో పారదర్శకత ఉండాలని, ప్రజలకు నిజమైన ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని మండల స్థాయి అధికారు లకు సూచించారు. పనుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా కొనసాగుతున్నాయని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీడీవో చెన్నమ్మ, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీలలో డబ్బులు ఉండి kooda పంచాయతీ వర్కర్స్ కు జీతాలు ఇవ్వరా

వనపర్తి : జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీలో పనిచేస్తున్న వర్కర్స్ కు రెండు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టి యు సి ఐ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా టి యు సి ఐ జిల్లా సహాయ కార్యదర్శి గణేష్, జిపి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏదుట్ల కురుమయ్య మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గ్రామపంచాయతీ పని చేస్తున్న వర్కర్స్ కు రెండు నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయి..గత రెండు రోజుల క్రితం కొన్ని గ్రామాలకు ఒక నెల జీతం మాత్రమే చెల్లించారు. ఎక్కువ గ్రామాల్లో రెండు నెలల వేతనాలు పెండింగ్లోనే ఉన్నాయి. గ్రామపంచాయతీలో డబ్బులు లేవు జీతాలు ఇవ్వలేము అని అధికారులు చెబుతున్నారు. వివిధ గ్రామపంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 15 ఫైనాన్స్ నుంచి విడుదలలో చేసిన డబ్బులు ప్రతి గ్రామపంచాయతీల్లో ఉన్నాయి గ్రామపంచాయతీ వర్కర్స్ జీతాల కోసం వాడుకోవద్దని రాష్ట్ర గ్రామ పంచాయతీ రాజ్ కమిషనర్ 15 ఫైనల్స్ నుండి వర్కర్స్ కు జీతాలు చెల్లించవద్దని సర్కులర్ వచ్చిందని అందుకే ఇవ్వట్లేదని పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు ఎంపీడీవోలు అంటున్నారు పై ఆదేశాల ప్రకారం నడుచుకుంటున్నామని మాకు తెలియజేస్తున్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండటానికి పచ్చదనం వెలిసిన దానికి ప్రజలకి మంచిని అందించడంలో ప్రజలకి ఆరోగ్యకరంగా ఉంచడంలో గ్రామపంచాయతీ కార్మికులు క్రియాశీలకంగా పని చేస్తున్నారు. అలాంటి వర్కర్స్ కు గ్రామ పంచాయతీల్లో డబ్బులు పెట్టుకొని కూడా జీతాలు ఇవ్వకపోవడం దారుణం గ్రామపంచాయతీ వర్కర్లకు వస్తున్న జీతం చాలా తక్కువగా ఉన్నది అది కూడా ప్రతి నెల సక్రమంగా రాకపోవడంలో వర్కర్స్ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవ్వడం గురికావడం జరుగుతుంది. కుటుంబ అవసరాలు తీరడం లేదు. కొన్ని గ్రామాలలో కొత్తగా వచ్చిన సర్పంచులు గ్రామపంచాయతీ వర్కర్స్ ను ఆదివారం కూడా పనిచేయాలని ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పనిచేయాలని లేకపోతే పని నుండి తొలగిస్తామని బెదిరిస్తున్నారు. భయవంతులకు గురి చేస్తున్నారు. వర్కర్స్ గ్రామాలలో వివిధ మురికి పనులు చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న వారికి రక్షణ సామాగ్రి మరియు సానిటరీ వస్తువులు సబ్బులు బ్లౌజులు డెటాల్ వంటి వస్తువులు ప్రతినెల తప్పనిసరిగా ఇవ్వాలి. పై సమస్యలు పరిష్కరించి కార్మికులకు నెల నెల క్రమం తప్పకుండా వేతనము ఇవ్వాలని కలెక్టర్ ను కోరగా కలెక్టర్ స్పందిస్తూ తక్షణమే ఒక నెల ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. మిగతా నెల 20 రోజుల తర్వాత ఇస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏదుట్ల కురుమయ్య ఉపాధ్యక్షులు రాజు సుబ్బయ్య గట్టమ్మ సహాయ కార్యదర్శులు గోవిందమ్మ జిల్లా కమిటీ సభ్యులు నాగన్న నిరంజన్ నరేష్ అభిశావళి రాజ్ కుమార్ రేణుక మహేష్ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సామాన్య ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు..!

**సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు**

**దేశంలో పెరుగుతున్న కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం..!**

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి జబ్బార్**





**(సమయం ప్రతినిధి వనపర్తి) :** వీపనగండ్ల మండలం,"గోపల్ దిన్నె" గ్రామంలో సిపిఎం ఉమ్మడి వీపనగండ్ల మండల స్థాయి "రాజకీయ శిక్షణ" తరగతులు ప్రారంభం అయ్యాయి. అంతకుముందు "కామ్రేడ్ నరసింహ" చిత్రపటానికి పార్టీ నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ బాల గౌడ్ అధ్యక్షతన "వర్తమాన రాజకీయాల" పై పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఎం.డి జబ్బార్ "పార్టీ నిర్మాణం" పై జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు క్లాస్ ను బోధించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ వీపనగండ్ల మండల కార్యదర్శి డి.బాల్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మహబూబ్ పాషా,చిన్నంబావి మండల కన్వీనర్ వెంకటేష్,ఆది,ఉమ్మడి మండల కార్యదర్శి వర్గ సభ్యులు వి.కృష్ణయ్య,రవి,నిరంజన్,గోపల్ దిన్నె గ్రామ ఉపసర్పంచ్ వెంకటయ్య, మండల నాయకులు నాగరాజ్, ఆశన్న, ఈశ్వర్,వెంకటస్వామి,శేఖర్ రెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిస్వా లోగో మార్పు

కోల్ కత్తా : ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నవారికి సొంత రాష్ట్రం మీద విపరీతమైన ప్రేమ ఉండాలి. ఓటు వేసి గెలిపించిన ప్రజల మీద అపారమైన గౌరవం ఉండాలి. మాతృభూమి అభివృద్ధి కోసం రకరకాల పనులు చేయాలి. అలాంటివారు జనాల్లో ఉండిపోతారు. జనాల మదిలో శాశ్వతంగా నిలిచిపోతారు. కానీ కొంతమంది అధికారంలోకి రాకముందు మాతృ భూమిని ప్రేమిస్తారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ద్వేషాన్ని పెంచుకొని ఇష్టానుసారంగా ప్రవర్తిస్తారు. చివరికి జనాలు వద్దని ఓడిస్తే.. తలవంచుకుంటారు. ఇప్పుడు ఈ పరిస్థితి పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి వచ్చింది. బెంగాల్ రాష్ట్రాన్ని 15 సంవత్సరాల పాటు మమత బెనర్జీ పరిపాలించారు.. 15 సంవత్సరాల కాలంలో మమత ఎంత చేయాలో అంత చేశారు. మెజారిటీ ప్రజల మనోభావాలను దెబ్బతీశారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు తెర లేపారు. చివరికి తాను ముఖ్యమంత్రిగా ఉన్న పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఔన్నత్యాన్ని కూడా దెబ్బతీశారు. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఆ మూలాలను తొలగిస్తోంది. శుభ్రమైన బెంగాల్ రాష్ట్రాన్ని నిర్మిస్తోంది. ఒక ముక్కలో చెప్పాలంటే బెంగాల్ రాష్ట్రంలో స్వచ్ఛభారత్ చేస్తోంది. మమత బెంగాల్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బిస్వా బంగ్లా అనే లోగోను ఏర్పాటు చేశారు. దీనిని రాష్ట్ర చిహ్నంగా ప్రకటించారు. 2013 సెప్టెంబర్ 16న బిస్వా బంగ్లా బ్రాండ్ లోగోను మమత మొదలుపెట్టారు. బి అనే బెంగాలీ అక్షరం చుట్టూ సంస్కృతి.. సంప్రదాయాలు.. చేతి వృత్తులకు ప్రాతినిధ్యం కల్పించే విధంగా ఈ లోగో రూపొందించారు. పశ్చిమ బెంగాల్లో మమత పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ లోగో అధికారిక బ్రాండింగ్ చిహ్నంగా ఉండేది. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ లోగో స్థానంలో కొత్త లోగోను తెచ్చారు.. మన దేశ జాతీయ చిహ్నమైన అశోక స్తంభాన్ని ఆ లోగో స్థానంలో ఏర్పాటు చేస్తున్నారు. బెంగాల్ రాష్ట్రంలో ఉన్న సాల్ట్ లేక్ స్టేడియంలో బిస్వా బంగ్లా లోగోను తొలగించి దాని స్థానంలో జాతీయ చిహ్నాన్ని అమర్చారు.

## భవిష్యత్తులో సంభవించే ఎలాంటి విపత్తులనైన సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధం

**-వరద ముప్పు ముంచెత్తితే.. క్షణాల్లో రక్షించే చర్యలపై 'నల్ల చెరువు'లో వనపర్తి జిల్లా యంత్రాంగం లైవ్ డెమో.**

**-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.**

**వనపర్తి. సమయం ప్రతినిధి:** విపత్తుల సమయంలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (NDMA) ఆదేశాలు, రాష్ట్ర విపత్తు స్పందన దళం (SDRF) సూచనల మేరకు వనపర్తి పట్టణంలోని నల్ల చెరువులో సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. భారీ వరదలు సంభవించిన సందర్భంలో ప్రజలను ఎలా రక్షించాలి, అత్యవసర పరిస్థితుల్లో స్పందనా బృందాలు ఎలా పనిచేయాలనే అంశాలపై ఈ మాక్‌డ్రిల్ చేపట్టారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా వరదల కారణంగా నల్ల చెరువులో ముంపునకు గురై చిక్కుకున్న ప్రజలను ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, అగ్నిమాపక, పోలీస్ శాఖలు సురక్షితంగా రక్షించే చర్యలను ప్రదర్శించారు. స్పందనా బృందాలు సమన్వయంతో పనిచేస్తూ బోటు, లైఫ్ జాకెట్ల సాయంతో ప్రజలను రక్షించి, ప్రథమ చికిత్స అందజేసి అంబులెన్సులో సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఈ మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు ఎస్పీ రాజేష్ మీనాతో కలిసి పరిశీలించి, సహాయక చర్యల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు వచ్చి అత్యవసర



పరిస్థితులు ఏర్పడిన సమయంలో ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ప్రజల్ని ఎలా కాపాడాలని అంశంపై మార్క్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు సంసిద్ధత కోసం ఈ మాక్ డ్రిల్ అనేది ఎంతో ముఖ్యమైన ప్రక్రియ అని తెలిపారు. వరదలు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడే ఏడు ప్రదేశాలను జిల్లాలో గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. 10 సెంటీమీటర్స్ పైన వర్షపాతం నమోదు అయితే నల్ల చెరువు ప్రాంతంలో వరద నీటితో అత్యవసర పరిస్థితి ఏర్పడే నేపథ్యంలో ఇక్కడ మోక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ వైద్య ఆరోగ్యశాఖ, నీటిపారుదల శాఖ, ఇతర ముఖ్యమైన శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలను కాపాడే చర్యలను సంసిద్ధతను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, డిఎస్పి గిరి ప్రసాద్, ఇతర జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రతా ప్రమాణాలతో పాఠశాల భవనాలు నిర్మించాలి

**గ్రామీణ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యా సౌకర్యాలు**
**నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి కల్పన ప్రభుత్వ లక్ష్యం**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**





నాగర్ కర్నూల్ ప్రతినిధి : నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను సోమవారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణంలో తరగతి గదులు, వసతి గృహాలు, ప్రయోగశాలలు, భోజనశాల, పారిశుధ్య సదుపాయాలు తదితర అంశాలను నిశితంగా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ...., గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యా సౌకర్యాలను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ విద్యార్థులు కూడా నగర స్థాయి విద్యా అవకాశాలను పొందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాల నిర్మాణ పనులను అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం, ఆలస్యం చోటుచేసుకోకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. నిర్మాణ పనుల పారదర్శకత కోసం పనుల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. పాఠశాల భవన నిర్మాణంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రతి గది విద్యార్థులకు అనుకూలంగా, సౌకర్యవంతంగా ఉండేలా నిర్మించాలని, ముఖ్యంగా హాస్టల్ గదులు, తాగునీటి వసతి, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయాలు, క్రీడా మైదానాలు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థుల తరగతుల నిర్వహణకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, భద్రతా, ప్రశాంతమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే పోలీసుల ప్రాధాన్యం ప్రజావాణిలో అదనపు ఎస్పీ

**ప్రతి ఫిర్యాదుకు చట్టబద్ధంగా వేగవంతమైన పరిష్కారం**
**ప్రజావాణి కార్యక్రమంతో పోలీసులపై పెరుగుతున్న విశ్వాసం**
**సోమవారం ప్రజావాణిలో 10 ఫిర్యాదుల స్వీకరణ**



వనపర్తి : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ రోజు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 10 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా వనపర్తి అదనపు ఎస్పీ రాజేష్ మీనా, కి వివరించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ గారు మాట్లాడుతూ.. ప్రజల సమస్యల ను నేరుగా విని, వాటికి తక్షణ పరిష్కారం చూపడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసే నమ్మకమైన వేదికగా మారిందన్నారు.ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును సున్నితంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని చట్టబద్ధంగా, వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని తెలిపారు. ప్రజలు పోలీసు శాఖపై విశ్వాసం ఉంచి, తమ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ రోజు ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులు:10
02 - భార్యాభర్తల వివాదాలకు సంబంధించినవి 03 -- భూ తగాదాలకు సంబంధించినవి 05 - పరస్పర గొడవలకు సంబంధించినవి ఉన్నాయి.

## ఇండ్లపై ఉన్న విద్యుత్ లైన్ తొలగించాలి



అమరచింత :అమరచింత మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ కృష్ణ నగర్ లో ఇండ్లపై ఉన్న 11 KV విద్యుత్ లైన్ ను తొలగించాలని కోరుతూ వనపర్తి జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖ S DE ని అమరచింత మున్సిపల్ 3వ వార్డ్ BRS పార్టీ కౌన్సిలర్ P.తిరుమలేష్ యాదవ్ కలిసి వినతి పత్రం అందజేశారు.

## ఏపీ నుంచి రాజ్యసభకు అన్నామలై?

విజయవాడ : తమిళనాడు రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన మాజీ ఐపీఎస్ అధికారి కె. అన్నామలై ఇప్పుడు పెద్దల సభలో అడుగుపెట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే నెలలో ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాల్లో ఒకదానిని బీజేపీకి కేటాయించాలని కూటమి నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ స్థానంలో ఎవరిని పంపాలనే విషయంపై బీజేపీ హైకమాండ్ సుదీర్ఘంగా చర్చించి, చివరకు అన్నామలై పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం.అన్నామలైను ఏపీ నుంచి రాజ్యసభకు పంపడం వెనుక బీజేపీ పెద్ద వ్యూహమే పన్నింది. తమిళనాడులో బీజేపీ ఎదలేకపోతోంది. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుని పని చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పుడు అక్కడ సనాతన ధర్మ వివాదం ఉంది. ఈ కోణంలో విజయ్ ప్రభుత్వాన్ని సమర్థవంతంగా ఢీకొట్టాలంటే అన్నామలైకు జాతీయ స్థాయి హోదా ఉండాలని బీజేపీ భావిస్తోంది. ఎంపీగా ఆయనకు దక్కే హోదా, తమిళనాడులో ఆయన గళాన్ని మరింత బలోపేతం చేస్తుందని, తద్వారా హిందూత్వ ముద్రతో బీజేపీని బలోపేతం చేయాలని అనుకుంటున్నారు.

## కరీంనగర్ మంత్రులకు పవర్ కట్

కరీంనగర్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తన కేబినెట్‌ను పూర్తిస్థాయిలో విస్తరించకుండా ఇప్పటికీ ఎమ్మెల్యేలను ఊరిస్తున్నారు. అసంతృప్తి వ్యక్తమైన ప్రతీసారి విస్తరణ అంశాన్ని తెరపైకి తెస్తున్నారు. అయితే రెండున్నరేళ్లుగా కోఆర్డినేషన్‌తో పాలన సాగిస్తున్నారు. కరీంనగర్ మంత్రులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సీఎం పాల్గొనే ప్రతీ కార్యక్రమంలో పాల్గొనడమే ఇందుకు నిదర్శనం. అయితే తాజాగా సీఎం సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఉమ్మడి జిల్లాకు చెందిన శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తోపాటు తొలిసారి ఎమ్మెల్యే అయి మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్న ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పవర్ కట్ చేశారు.సీఎంఆర్‌ఎఫ్ విషయంలో నిన్నటి వరకు మంత్రులు తమ ఉమ్మడి నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా సిఫార్సు చేయడానికి సౌలభ్యం ఉండేది. కానీ ఇప్పుడు ఆ వెసులుబాటును కట్ చేశారు. ఇకపై ముగ్గురు మంత్రులు ఉమ్మడి జిల్లా వరకు మాత్రమే సిఫారసు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయిలో చేస్తే పరిగణనలోకి తీసుకోరు.సీఎంఆర్‌ఎఫ్‌కు సంబంధించి దరఖాస్తులు, చెక్కుల సవరణ ప్రక్రియలను పూర్తిగా డిజిటల్ పరిష్కారంగా మార్చారు. ఇది అభ్యర్థుల సమాచార నమోదు నుంచి చెక్కుల పంపిణీ, భౌన్స్ వరకు ట్రాక్ చేయడానికి, మినహాయింపులు తగ్గించడానికి, మేనేజిమెంట్‌లో జోక్యాలను తగ్గించడానికి ఉపయోగపడుతుంది. ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా పాలనలో పత్రాలు, నిర్ణయాలపై పారదర్శకతతో పాటు వేగవంతమైన తనిఖీలు కూడా సులభమవుతాయి.సిఫార్సుల పరిమితి స్థానిక స్థాయిలో నిధుల సమకూర్పు ఫోకస్‌ను పెంచే అవకాశం కలిగిస్తుంది. ఈ కారణంగా నియోజకవర్గ ధోరణుల పరంగా మంత్రుల బాధ్యతలు స్పష్టమవుతాయి. మరిన్ని పారదర్శక చర్యలు వల్ల సిఫార్సుల వ్యక్తిగత నియంత్రణ పెరుగుతుంది. అయితే రాజకీయసంబంధాలలో వ్యతిరేక భావనలను పెంచే అవకాశం ఉంది. డిజిటలైజేషన్ దశ అధికారిక ప్రక్రియలను వేగవంతం చేసినప్పటికీ, సాంకేతిక ప్రాప్తి లేని ప్రాంతాల ప్రజల కోసం సాయంగా ఏర్పాటు చేయకపోతే కొందరు లబ్ధిదారులు నష్టపోయే అవకాశముంది.ఈ నిర్ణయం మంత్రుల రాజకీయ వ్యూహాలకు, స్థానిక అభివృద్ధి ప్రాధాన్యాలకు ప్రభావం చూపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోనే ఫోకస్ పెరగడంతో మెరుగైన సామాజిక బహుమతి కార్యక్రమాలు సాధ్యమవుతాయని సమర్థకులు అంటున్నారు.

# ఘనంగా ముగిసిన విద్యా వారోత్సవాలు





నాగర్ కర్నూల్ ప్రతినిధి : జిల్లా వ్యాప్తంగా మే 11 నుండి 17 వరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన "విద్యా వారోత్సవాలు" ఆదివారం కలెక్టరేట్‌లోని IDOC సమావేశ మందిరంలో జరిగిన "విద్యా విజయోత్సవం" కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం, ప్రభుత్వ పాఠశాలలలో నమోదు పెంపు, బోధన నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యా రంగ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికను అమలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యా విజయోత్సవం సందర్భంగా పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు మరియు ప్రశంసాపత్రాలు అందజేశారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కూడా సత్కరించి అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు మాట్లాడుతూ...., గత సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లాను రెండో స్థానంలో నిలిపినందుకు జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ గారిని మరియు విద్యాశాఖ యంత్రాంగాన్ని అభినందించారు. వచ్చే విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయాలు కార్పొరేట్ స్థాయికి ఎదిగేలా అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఫలితాల సాధనకు అనుసరించిన వ్యూహాలను మరింత బలోపేతం చేసి వచ్చే సంవత్సరం రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం విద్యా వారోత్సవాల్లో విభిన్న కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన వివరించారు.వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు జిల్లాలో 17 పాఠశాలల్లో సమ్మర్ క్యాంప్స్ ప్రారంభించగా, రెండవ రోజు పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం రెండు పాఠశాలల్లో రెమెడియల్ తరగతులు ప్రారంభించారు. మూడవ రోజు నియోజకవర్గ స్థాయిలో సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు విద్యాశాఖపై అవగాహన సదస్సులు నిర్వహించారు. నాలుగవ రోజు బడిబాట కార్యక్రమం, మెగా ర్యాలీ ద్వారా విద్యార్థుల నమోదు పెంపు చర్యలు చేపట్టారు. ఐదవ రోజు లైబ్రరీ డే, ఆరవ రోజు కళావైభవం (సాంస్కృతిక కార్యక్రమాలు) నిర్వహించగా, ఏడవ రోజు విద్యా విజయోత్సవం ఘనంగా నిర్వహించి వారోత్సవాలను ముగించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య, పరీక్షల విభాగం అధికారి రాజశేఖర్ రావు, సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు విద్యాశాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ విద్యాశాఖ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

# యువత ఆరోగ్యమే సమాజ బలం

**క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి**
**గ్రామీణ స్థాయి నుంచే క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**




నాగర్ కర్నూల్ ప్రతినిధి : యువత శారీరకంగా మానసికంగా దృఢంగా ఉంటేనే సమాజం బలంగా నిలుస్తుందని పేర్కొం టూ, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో కనీసం కొంత సమయాన్ని వ్యాయామం, నడక, యోగా వంటి కార్యక్రమాలకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో క్రీడలు, యువత ఆరోగ్యం అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ జిల్లా యువజన క్రీడల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నాగర్ కర్నూల్ పట్టణంలో యోగా, "ఆరోగ్య తెలంగాణ" కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తొలి రోజు ఉదయం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో "ఫిట్ అండ్ యాక్టివ్ 2ఖ రన్" కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. నాగర్ కర్నూల్ క్రీడా మైదానం నుంచి కేసరి సముద్రం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన 2కే రన్‌లో కలెక్టర్ యువత, అధికారులతో కలిసి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, యువత శక్తి, క్రీడా సంస్కృతి అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లో ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక జీవనశైలిలో వ్యాయామం, క్రీడలు తగ్గిపోతున్న నేపథ్యంలో యోగా, నడక, పరుగులు వంటి అలవాట్లను ప్రతిరోజూ జీవితంలో భాగం చేసుకోవాలని యువతకు సూచించారు. "ఫిట్ అండ్ యాక్టివ్ 2ఖ రన్" వంటి కార్యక్రమాలు కేవలం ఒక రోజు కోసం కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని, అది వారి భవిష్యత్తు నిర్మాణానికి దోహదం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచే క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు కృషి చేస్తోందన్నారు. కలెక్టర్ స్వయంగా యోగా కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు, యువతకు ప్రేరణ గా నిలిచారు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన యోగా కార్యక్రమంలో వివిధ ఆసనాలు, శ్వాస వ్యాయామాలను పతంజలి యోగ గురువు ఆధ్వర్యంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల శాఖ అధికారి సీతారాం నాయక్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, ఆర్డీవో సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి గా ఈటెల రాజేందర్

- ఢిల్లీలో తెలంగాణ రాజకీయాలపై హాట్ చర్చ
- బండి సంజయ్‌కు పదవి గండం..?
- ఉద్యమకారులు , మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి ?
- ఢిల్లీ, రాష్ట్ర బీజేపీ వర్గాల్లో జోరుగా ప్రచారం
- తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలపై ఊహాగానాలు



న్యూఢిల్లీ / హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపుతున్న భగీరథ్ POCSO కేసు వ్యవహారం ఢిల్లీ రాజకీయ వర్గాల్లో కూడా తీవ్ర చర్చకు దారితీసినట్లు సమాచారం. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌పై పెరుగుతున్న రాజకీయ ఒత్తిళ్లు, ప్రతిపక్షాల నిరసనలు, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో మార్పులు జరిగే అవకాశాలపై జోరుగా ప్రచారం సాగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో కేంద్ర క్యాబినెట్‌లో భారీ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశమున్నట్లు ఢిల్లీ బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో తెలంగాణకు చెందిన కొందరు నేతలకు కీలక బాధ్యతలు అప్పగించే అంశం కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో మల్కాజ్‌గిరి ఎంపీ, ఉద్యమకారుడు ఈటల రాజేందర్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించిన ఈటల రాజేందర్‌కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి ఇచ్చే అవకాశాలపై ఢిల్లీ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. తెలంగాణలో బీసీ సామాజిక వర్గ సమీకరణాలు, రాబోయే ఎన్నికల రాజకీయ వ్యూహాలు, రాష్ట్రంలో పార్టీ బలోపేతం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈటల రాజేందర్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు సమాచారం. మరోవైపు భగీరథ్ కేసు వ్యవహారం బయటకు వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా బండి సంజయ్‌పై రాజకీయ ఒత్తిడి పెరిగింది. ప్రతిపక్ష పార్టీలు కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తుండగా, సోషల్ మీడియాలో కూడా ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది.

## వైసీపీ గ్రాఫ్ పెరిగిందా... తగ్గిందా

విజయవాడ : ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు సమీపిస్తోంది. వచ్చే నెల 12 నాటికి రెండేళ్లు పూర్తికానుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమైన ఈ రెండు సంవత్సరాల్లో.. ఆ పార్టీకి గ్రాఫ్ పెరిగిందా? తగ్గిందా? అంటే సరైన సమాధానం దొరకని పరిస్థితి. అయితే ఒక్క మాట మాత్రం చెప్పగలం. గతంలో అధికారంలో ఉన్నప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు ను ఇప్పటికీ ప్రజలు మర్చిపోలేక పోతున్నారు.. అదే సమయంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేసి చూపిస్తోంది. ముఖ్యంగా పారిశ్రామిక పెట్టుబడులతో పాటు అభివృద్ధి పనులను చేసి ప్రజల దృష్టి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు మళ్లకుండా చూస్తోంది. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుణ పాఠాలు నేర్చుకోలేదు. ప్రజలను ఒప్పించే ప్రయత్నం చేయలేదు. వారితో మమేకం కాలేకపోతోంది కూడా. అమరావతి రాజధాని అంశం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నీడలా వెంటాడుతూనే ఉంది. ప్రధానంగా జగన్మోహన్ రెడ్డి తాజాగా ప్రతిపాదన చేసిన మావిగన్ పై ప్రజల్లో ప్రతికూలత తెచ్చింది. ఆయన మాటలను ప్రజలు చాలా తేలిగ్గా తీసుకున్నారు. అదేదో కొత్త ప్రతిపాదన కంటే అమరావతిపై విషం చిమ్మడమే అనేది మెజారిటీ ప్రజల అభిప్రాయం. గతసారి టిడిపి అధికారంలోకి వచ్చినప్పుడు అమరావతిలో గ్రాఫిక్స్ చేశారు అంటూ జగన్మోహన్ రెడ్డి చెప్పిన మాటలను ప్రజలు నమ్మారు. ఇప్పుడు కూడా అమరావతిపై పదే పదే ఆ తరహా ప్రచారం చేయడానికి ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరికలు



భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలానికి చెందిన పలువురు యువకులు కోరే శరత్ ఆధ్వర్యంలో నేడు తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ)లో చేరారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ... రాష్ట్రంలో యువత మార్పు కోరుకుంటోందని, వారి ఆశలు ఆకాంక్షలకు ప్రతిబింబంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎదుగుతోందని అన్నారు. ముఖ్యంగా బీసీ వర్గాలకు రాజకీయంగా న్యాయం జరగాలంటే యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎన్నాళ్లుగానో అన్యాయానికి గురవుతున్న బీసీలకు నిజమైన అధికారాన్ని తీసుకురావడం టీఆర్పీ లక్ష్యమని స్పష్టం చేశారు. యువత శక్తి దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, అదే శక్తి ఇప్పుడు సామాజిక న్యాయం కోసం పోరాడాలని ఆయన అన్నారు. కుల, వర్గ భేదాలు లేకుండా ప్రతి పేద, బలహీన వర్గానికి న్యాయం జరిగేలా టీఆర్పీ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు యువత పెద్ద ఎత్తున పార్టీలో చేరడం ఆశాజనకమని, ఇది రాబోయే రాజకీయ మార్పుకు సంకేతమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, ఆఫీస్ కోఆర్డినేటర్ లింగం యాదవ్ పాల్గొన్నారు.

## 60 యేండ్లు దాటిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు కనీస పెన్షన్ 9000 రూపాయలు ఇవ్వాలి

**సి రాజు తెలంగాణ ప్రగతిశీల భవన & ఇతర నిర్మాణ కార్మిక సంఘం (TUCI) జిల్లా ప్రధాన కార్యదర్శి**




వనపర్తి : వనపర్తి జిల్లా మదనాపురం మండలం కొత్తపల్లి గ్రామంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి కరపత్రాలు పంచి గోడ పత్రికను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సి రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఉన్న కార్మికులకు పూర్తిస్థాయిలో ఫలితాలు అందడం లేదు రాష్ట్రంలో ఉన్న కార్మికులందరికీ బిఓసి కార్డులు లేవు కార్డు తీసుకున్న కార్మికులు రెన్యువల్స్ చేసుకోలేకపోతున్నారు కార్డు ఉండి రెన్యువల్ అయినా కార్మికులకు క్లెయిమ్స్ సక్రమంగా అందడం లేదు ఏ రకంగా చూసిన నిరక్షరాసులైన భవన నిర్మాణ కార్మికులకు సులభతరంగా లబ్ధి దొరకడం లేదు దాంతో తీర్వమైన నష్టాలకు గురవుతున్నారు. 60 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికుడికి కార్డు ఉపయోగపడటం లేదు. భవన నిర్మాణ కార్మికుడిగా నెలకు 1 చొప్పున సంవత్సరానికి 12 రూపాయలు చెల్లిస్తున్న ఆ కార్మికుడికి పెన్షన్స్ సౌకర్యం లేదు ప్రభుత్వ వాగ్దానంలో భాగంగా సహజంగానే పెన్షన్లు ప్రకటిస్తున్న ప్రభుత్వాలు కార్మికుడిగా నమోదు చేసుకున్నప్పటికీ పెన్షన్లు ప్రకటించడానికి ప్రభుత్వం వెనకాడుతున్నది. చలిలో వణుకుతూ, వానలో తడుస్తూ, ఎండలో ఎండుతూ, ఆరుగాలం కష్టపడి నిర్మాణాలు (ప్రాజెక్టులు, పెద్ద పెద్ద బిల్డింగులు) చేస్తున్న జాతి నిర్మాణం కోసం కృషి చేస్తున్న పెన్షన్ ఇవ్వడం లేదు 60 సంవత్సరాల పైబడిన వారికి నెలకు 9000 పెన్షన్ ఇవ్వాలని కోరుతున్నాం. మరియు ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలు డెలివరీ, మ్యారేజ్ గిఫ్ట్, సహజ మరణం, పథకాలను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. తదితర డిమాండ్ల సాధన కోసం ఈనెల 25 వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం ఈ కార్యక్రమానికి మదనపురం మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు తిమ్మరాజు, కార్తీక్, సుధాకర్, మాసన్న, శేఖర్, కొల్లం, మహేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## పది రోజుల్లో రూ.100 పెరిగిన చికెన్

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో నాన్‌వెజ్ ప్రియులకు చికెన్ ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ధరలతో చికెన్ ప్రియులు షాకవుతున్నారు. ముఖ్యంగా మేలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో చికెన్ ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. సాధారణంగా మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే చికెన్ రేట్లు, కేవలం 10–15 రోజుల్లోనే కిలోపై రూ.100 వరకు పెరగడం సామాన్యుడికి పెద్ద భారంగా మారింది. ప్రస్తుతం మార్కెట్‌లో స్కిన్‌లెస్ చికెన్ ధర కిలో రూ. 350 నుండి రూ. 370 మార్కును దాటగా, కొన్ని ప్రాంతాల్లో రూ. 400 వరకు కూడా విక్రయిస్తున్నారు. ఫాం కేజీ కోడి ధర 115 రూపాయలు ఉంది.. డ్రెస్సెడ్ చికెన్ 220 ? 240 వరకు.. స్కిన్ లెస్ రూ.250 వరకు ఉంది.. హైదరాబాద్ నగరంలో కేజీ చికెన్ ధర రూ.270 వరకు విక్రయిస్తున్నారు. గుడ్లు డజన్ రూ. 72 వరకు ఉంది. అయితే.. ప్రాంతాల వారీగా చికెన్ ధరల్లో వ్యత్యాసం ఉంటుంది.. ఆదివారం కూడా దాదాపుగా ఇవే ధరలు కొనసాగుతాయని కోళ్ల ఫాం యజమానులు, చికెన్ వ్యాపారస్థులు చెబుతున్నారు. వేసవి ఎండల తీవ్రత: ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడం పౌల్ట్రీ రంగాన్ని దెబ్బతీసింది. విపరీతమైన వేడి తట్టుకోలేక కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీనివల్ల ఫారాలలో కోళ్ల ఉత్పత్తి, బరువు గణనీయంగా తగ్గిపోయాయి. ఎండల దెబ్బకు నష్టాలు వస్తుండటంతో పౌల్ట్రీ రైతులు కూడా కొత్త బ్యాచ్‌ల పెంపకంపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఉత్పత్తి తగ్గిపోవడంతో మార్కెట్‌కు కోళ్ల సరఫరా చాలా వరకు క్షీణించింది. అయితే, ఇదే సమయంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల సీజన్ నడుస్తుండటంతో చికెన్‌కు డిమాండ్ భారీగా పెరిగింది. సప్లై తక్కువగా ఉండి, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ధరలకు రెక్కలు వచ్చాయి. వీటికి తోడు నిర్వహణ ఖర్చులు పెరగడం వల్ల.. చికెన్ ధరలు పెరిగాయని వ్యాపారస్థులు చెబుతున్నారు. ఈ ధరల పెరుగుదల మరో 15 నుండి 20 రోజుల పాటు ఇలాగే కొనసాగే అవకాశం ఉందని, జూన్ మొదటి వారంలో వర్షాలు పడి వాతావరణం చల్లబడిన తర్వాతే రేట్లు తగ్గుముఖం పడతాయని వ్యాపార వర్గాలు అంచనా.



# రామదూత... అభయదాత

**శ్రీరాముని కథలో హనుమంతుడిది చాలా విశిష్టమైన పాత్ర. రాముని దాసుడైన హనుమంతుడు భక్తికి, శక్తికి ప్రతీకగా నిలుస్తాడు. వారిద్దరి మధ్య ఉన్న బంధం... భగవంతుడికి, భక్తుడికి మధ్య ఉండే అవినాభావ సంబంధాన్ని తెలియజేస్తుంది. శ్రీరాముడికోసం కొండనైనా ఎత్తి తీసుకురాగలిగే శక్తి హనుమంతుడిది. హనుమంతుడికి ఇచ్చిన వరం కోసం... అతను చిటికెలు వేస్తున్నంతసేపు ఆవలింతలు తీసేంత ప్రేమ శ్రీరాముడిది. ఈ బంధం మన దేశ పౌరాణిక గాథలలో చిరస్థాయిగా నిలిచిపోయింది.**

### వినయశీలి...

శ్రీరాముడి పట్ల హనుమంతుడి భక్తి ఎంత గొప్పదంటే... ఒకసారి సీతాదేవి ఒక ముత్యాలహారాన్ని హనుమంతుడికి బహుమతిగా ఇచ్చింది. ఆ హారంలో ఉన్న ముత్యాలను ఒక్కటొక్కటిగా బయటకు తీసి చూసి "ఇందులో రాముడు లేడు. దీన్ని నేనేం చేసుకుంటాను?" అన్నాడు హనుమంతుడు. "మరి రాముడు ఎక్కడ ఉన్నాడు?" అని అడిగింది సీతాదేవి. "ఇదిగో... రాముడు ఇక్కడ ఉన్నాడు" అంటూ తన గుండెను చీల్చి చూపించాడు హనుమంతుడు. మన సూక్ష్మ శరీరంలో శ్రీరాముడి స్థానం కుడివైపు హృదయ చక్రంలో ఉంటుంది. ఎవరైతే శ్రీరాముని గుణాలను తమ దైనందిన జీవితంలో ఆచరిస్తూ, ఆదర్శవంతమైన జీవనాన్ని కొనసాగిస్తారో... వారి హృదయ చక్రంలో శ్రీరాముడు కొలువై ఉంటాడు. అహంకారాన్ని వారి దరి చేరనివ్వడు. దీనికి ఉదాహరణ హనుమంతుడే. ఆయన ఎంత క్రియాశీలత కలిగి చురుగ్గా పనులు చేస్తూ ఉంటాడో... అంతటి వినయ విధేయతలు కూడా కలిగి ఉంటాడు. మనం కూడా పనులు ఎక్కువగా చేసేకొద్దీ... వినయవిధేయతలు కలిగి ఉంటేనే సమతుల్యతతో ఉండడం సాధ్యమని తెలుసుకుంటాం. ఎప్పుడైతే మన ద్వారా జరుగుతున్న పనులన్నీ మనమే చేసేస్తున్నామనే భ్రమలో చిక్కుకుంటామో.... అప్పుడు అహంకారం బారిన పడతాం. మన ద్వారా జరుగుతున్న పనులన్నిటినీ ఆ భగవంతుని శక్తే జరిపిస్తున్నదనే విషయం తెలుసుకొని, వినమ్రతను కలిగి ఉంటే... భగవంతుడి శక్తికి చక్కని వాహకాలుగా మారుతాం. మరిన్ని మంచి పనులు చేయగలుగుతాం.

### భజే వాయువేగం...

హనుమంతుడి నుంచి మనం నేర్చుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే... ఆయన ఏ పనినైనా చాలా వేగంగా చేస్తాడు. ఆయనది వాయువేగం. రాముడు తన సందేశాన్ని సీతాదేవికి పంపాలనుకున్నప్పుడు... తన ఉంగరాన్ని హనుమంతుడికి ఇచ్చి పంపిస్తాడు. ఎందుకంటే ఆ పనిని హనుమంతుడు చేయగలిగేంత వేగంగా శ్రీరాముడు చేయలేడు. అలాగే, సంజీవనీ మూలిక అవసరమైనప్పుడు.... అది ఒక ప్రత్యేకమైన పర్వతం మీద ఉంటుందని చెప్పి, దాన్ని తీసుకురావాలని హనుమంతుణ్ణి పంపించాడు శ్రీరాముడు. అక్కడికి వెళ్ళిన హనుమంతుడు ఆ మూలికకోసం వెతుకుతూ సమయం వృథా చేయడం ఎందుకని... మొత్తం పర్వతాన్నే తీసుకువచ్చేశాడు. ఏ పని చేసినా వెంటనే చేయడం, వేగంగా చేయడం, సమయాన్ని వృథా కానివ్వకపోవడం హనుమంతుడి లక్షణం. హనుమంతుడి ఆశీస్సులు పొందినవారికి 'సత్–అసత్ వివేక బుద్ధి' లభిస్తుంది. అంటే 'ఏది సత్యం? ఏది అసత్యం?' అని తెలుసుకోగలిగే వివేకం కలుగుతుంది. 'ఏది మంచి? ఏది చెడు?' అనే విచక్షణ కలిగిన మనిషి చెడు నుంచి దూరంగా ఉంటాడు, తనను తాను రక్షించుకోగలుగుతాడు. సన్మార్గంలో నడిచి ఆధ్యాత్మికంగా ఉన్నతిని పొందుతాడు. హనుమంతుడి గుణాలైన వినయ విధేయతలను, భక్తితో కూడిన శక్తిని దైనందిన జీవితంలో మనం కూడా అలవరచుకుంటే ఆయన అనుగ్రహాన్ని, శ్రీరాముడి కృపా కటాక్షాలను నిరంతరం పొందగలం. మానవుల సూక్ష్మ శరీరంలోని పింగళా నాడి మొత్తాన్ని హనుమంతుడు ప్రభావితం చేస్తాడు. పింగళా నాడికే 'సూర్య నాడి' అనే మరో పేరు ఉంది. ఇది మానవులకు క్రియాశక్తిని ప్రసాదిస్తుంది. అంటే మానవులకు పనులు చేయడానికి కావలసిన శక్తి ఈ నాడి నుంచే లభిస్తుంది. కానీ పనులు ఎక్కువగా చేస్తూ, విశ్రాంతి తీసుకోవడం మరచిపోయినప్పుడు... ఆ నాడిలో వేడి ఎక్కువై అనేక రకాల వ్యాధులకు దారి తీస్తుంది. మానవుల పింగళా నాడి మీద తాను పనిచేసి, అక్కడ అధికంగా ఉండే సూర్యతాపం నుంచి వారిని రక్షించి, చల్లదనాన్ని ప్రసాదించడం తన బాధ్యత అని హనుమంతుడికి ఆయన జన్మించే సమయానికే తెలుసు. అందుకే బాల్యంలోనే సూర్యుణ్ణి మింగెయ్యడానికి ప్రయత్నించాడు. దేవతలు ప్రార్థించడంతో... సూర్యుణ్ణి విడిచిపెట్టాడు.

---

ఒక వ్యక్తి శారీరకమైన అవయవానికి కార్డియాలజిస్టుగా చికిత్స చేస్తూ ఉంటాను. అదే సమయంలో... ఆ వ్యక్తి హృదయంలోని నిశ్శబ్దమైన అరల్లో సూక్ష్మమైన, నిరంతరమైన సంభాషణ ఒకటి కొనసాగుతూ ఉంటుంది. అది స్కెతస్కోపులో వినిపించదు. ఈసీజీలో కనిపించదు. అయినప్పటికీ అది మన జీవితాల గమనాన్ని నిర్దేశిస్తూ ఉంటుంది. ఈ సంభాషణ భారతీయ తత్త్వశాస్త్రంలో లోతుగా వర్ణించిన రెండు పురాతనమైన శక్తుల మధ్య జరుగుతుంది. అవి: శ్రేయస్సు, ప్రేయస్సు. శ్రేయస్సు అంటే హితమైనది, మనకు మంచి చేసేది, మన ఉన్నతికి దోహదం చేసేది. ప్రేయస్సు అంటే ప్రియమైనది. అది ఇంద్రియ సంతృప్తి, సౌకర్యం, స్వల్పకాలిక తృప్తి లాంటివాటికి... అంటే తాత్కాలికమైన సుఖాన్ని అందించేవాటికి ప్రతీక. అది మనలోని ఆవేశాలను, కోరికలను, తరచుగా మన బలహీనతలను ప్రేరేపిస్తుంది. ఈ వైరుధ్యాన్ని 'కఠోపనిషత్తు'లో ఋషులు చక్కటి స్పష్టతతో వివరించారు.



# హితమా? ప్రియమా?

### అది ఒక సంస్కృతి

మరొకవైపు శ్రేయస్సు ఉన్నతమైన మేలుకు మార్గం. తక్షణమే అది సులభం కాకపోవచ్చు. కానీ ఎదుగుదలకు, అంతర్గతమైన పరిశుద్ధతకు, అంతిమంగా మోక్షానికి దారి తీసే ఎంపిక. నేటి వేగవంతమైన ప్రపంచంలో, ప్రేయస్సు తాలూకు ఆకర్షణ ఇదివరకటికన్నా బలంగా మారింది. తక్షణం పొందే తృప్తి అనేది కేవలం ఒక ధోరణి మాత్రమే కాదు, అది ఒక సంస్కృతి. అనారోగ్యకరమైన జీవనశైలి ఎంపికలు కావచ్చు, భావోద్వేగ ప్రతిచర్య కావచ్చు, నిరంతరం గుర్తింపు కోసం ఆరాటపడడం కూడా కావచ్చు... దీర్ఘకాలంలో మనకు ఏది మంచిది అనే దానికన్నా... ఇప్పుడు ఏది బాగుంటుందనుకుంటామో దాన్నే మనం పదేపదే ఎంచుకుంటూ ఉంటాం. మానసికమైన దృక్పథంలోంచి చూసినప్పుడు, ఇది 'ఆలస్యమైపోయిన తృపి'?త అనే భావనకు దగ్గరగా ఉంటుంది. భవిష్యత్ ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటూ... తక్షణం లభించే ప్రతిఫలాలను తిరస్కరించే వ్యక్తులు భావోద్వేగపరంగా, సామాజికంగా, వృత్తిపరంగా మెరుగైన ఫలితాలు పొందుతారు. లింబిక్ వ్యవస్థ, ప్రీఫ్రంటల్ కార్టెక్స్ మధ్య జరిగే పరస్పర చర్య ఉదాహరణతో దీని గురించి న్యూరోసైన్స్ వివరిస్తుంది.

### దాన్నే ఎంచుకోండి...

ప్రతిరోజూ హృదయపూర్వకమైన ధ్యానం ద్వారా... మనస్సు క్రమంగా ప్రశాంతతంగా మారుతుంది, శుద్ధిని పొందుతుంది. శుద్ధి చేసుకొనే అభ్యాసం మనల్ని ప్రేయస్సు వైపు లాగే భావోద్వేగ ముద్రలను (సంస్కారాలను) తొలగించడానికి తరచుగా సాయపడుతుంది. ప్రార్థన మనల్ని ఒక ఉన్నతమైన మూలంతో అనుసంధానిస్తుంది. మన అంతర్గతమైన సంకల్పాన్ని బలోపేతం చేస్తుంది. కాలం గడిచేకొద్దీ ఈ అభ్యాసాలు అంతర్గతమైన అవగాహనను పెంపొందిస్తాయి. ప్రేరణలను అనుసరించి ప్రవర్తించే వ్యక్తి ముందుగానే వాటిని గమనించడం మొదలుపెడతాడు. ఆ విరామమే పరివర్తనాత్మకంగా మారుతుంది. ఒక వ్యక్తి ప్రేయస్సు కన్నా శ్రేయస్సును చైతన్యవంతంగా ఎంచుకోవడానికి అది అనుమతిస్తుంది. హృదయం సూక్ష్మ విచక్షణను (వివేకాన్ని) పెంచుకుంటుంది. ఒకప్పుడు సంఘర్షణగా ఉన్నది ఇప్పుడు సహజమైన ప్రాధాన్యతగా మారుతుంది. కాబట్టి, హార్ట్‌ఫుల్‌నెస్ బయటి నుంచి క్రమశిక్షణను విధించదు, లోపలి నుంచి దాన్ని మేల్కొలుపుతుంది. మనలోని ఉన్నతమైన తోడేలుకు బలంతో కాకుండా... అవగాహన, ప్రేమ, అంతర్గత అనుసంధానత ద్వారా పోషణ లభిస్తుంది. జీవితంలోని ప్రతి కూడలిలోనూ ఆగండి. 'ఇప్పుడు ఇది నాకు కేవలం సంతోషాన్ని కలిగిస్తోందా? లేదంటే నన్ను మరింత గొప్ప స్థితి కోసం తీర్చిదిద్దుతోందా?' అని ఆలోచించండి. మిమ్మల్ని ఉన్నతివైపు నడిపించే తోడేలుకు ఆహారాన్ని అందించండి. శ్రేయస్సు మీ స్వభావంలో భాగం అయ్యేవరకూ దాన్ని పదేపదే ఎంచుకోండి.

### రెండు తోడేళ్ళు

ప్రేయస్సు తత్వాన్ని పదే పదే ఎంచుకోవడం అనే ప్రక్రియ శరీరంలో ఎలా వ్యక్తమవుతుందో ఒక కార్డియాలజిస్టుగా నేను తరచుగా చూస్తూ ఉంటాను. కదలకుండా ఉండే అలవాట్లు, సరైన ఆహారాన్ని తీసుకోకపోవడం, ఒత్తిడికి లొంగిపోవడం, వ్యసనాలు వీటిలో ప్రధానమైనవి. ఈ ఎంపికలు ఎక్కువై పోగు పడి... అధిక రక్తపోటు, మధుమేహం, హృదయ సంబంధమైన వ్యాధులకు దారితీస్తాయి. శ్రేయస్సు ఆధారితమైన జీవితం... క్రమశిక్షణ, వ్యాయామం, భావోద్వేగ సమతుల్యతల ద్వారా శక్తిమంతమైన నివారణ ఔషధంగా పని చేస్తుంది. శ్రేయస్సు, ప్రేయస్సులను మనలో ఉండే రెండు తోడేళ్ళుగా దాజీ అభివర్ణించారు. ఒకటి ఉన్నతమైన ఆకాంక్ష, దయ, క్రమశిక్షణ, ఆధ్యాత్మికమైన పరిణామాలకు ప్రతీక. మరొకటి భోగ విలాసాలు, పరధ్యానం, అహం ద్వారా ప్రేరితమయ్యే వాంఛలకు ప్రతీక. మనం దేన్ని పెంచి పోషిస్తామో అది మరింత బలపడుతుంది. ఉన్నతమైన తోడేలుకు చైతన్యవంతమైన పోషణను అందించే ఆచరణాత్మకమైన, అనుభవపూర్వకమైన మార్గాన్ని హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానం అందిస్తుంది.

---

# యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్ విస్తరణ

హైదరాబాద్ : తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఉప్పుగూడ, మలక్‌పేట రైల్వే స్టేషన్లలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అమృత్ భారత్ పథకం కింద రూ. 26 కోట్లతో ఉప్పుగూడ స్టేషన్‌ను డిసెంబర్ కల్లా ఆధునీకరిస్తామన్నారు. అలాగే ఎంఎంటీఎస్ రెండో దశలో భాగంగా భాగ్యనగరం నుంచి యాదగిరిగుట్ట వరకు రైలును పొడిగించనున్నట్లు ప్రకటించారు. గత 12 ఏళ్లలో రాష్ట్రంలో 347 కి.మీ. కొత్త రైల్వే లైన్లు వేసినట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు.తెలంగాణలో రైల్వే రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్‌లోని ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ప్రయాణికుల మౌలిక వసతుల కల్పన, ఆధునికీకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌ను రూ. 26 కోట్ల భారీ బడ్జెట్‌తో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులన్నింటినీ రాబోయే డిసెంబరు నాటికి పూర్తి చేసి ప్రజలకు, స్థానిక ప్రయాణికులకు అందు బాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు ఆయన మలక్‌పేట రైల్వేస్టేషన్‌ను కూడా సందర్శించి, అక్కడ జరుగుతున్న ప్రగతి పనుల వేగాన్ని సమీక్షించారు. నగర ప్రయాణికులకు తీపి కబురు అందించారు. హైదరాబాద్ నగర శివార్లకు రవాణా సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ఎంఎంటీఎస్ రెండో దశ ప్రాజెక్టులో భాగంగా నగరంలోని ప్రధాన మార్గం నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ రైలు సర్వీసులను పొడిగించనున్నట్లు ప్రకటించారు. దీనివల్ల నిత్యం వేలాది మంది భక్తులకు, ఉద్యోగులకు తక్కువ ఖర్చుతో కూడిన సురక్షిత ప్రయాణం లభిస్తుందన్నారు. గత పాలకుల హయాంతో పోలిస్తే.. గడిచిన 12 ఏళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా రికార్డు స్థాయిలో 347 కిలోమీటర్ల మేర నూతన రైల్వేలైన్లను నిర్మించిందని చెప్పారు. అనేక మార్గాలను విద్యుద్దీకరణ, డబ్లింగ్ పూర్తి చేసిందని ఈ సందర్భంగా ఆయన గణాంకాలతో వివరించారు. హైదరాబాద్‌లోని సబర్బన్ స్టేషన్ల రూపురేఖలను మార్చడమే ధ్యేయంగా కేంద్రం నిధులు కేటాయిస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఉప్పుగూడ, మలక్‌పేట వంటి స్టేషన్లలో కేవలం ప్లాట్‌ఫారాల పొడిగింపు మాత్రమే కాకుండా.. ఆధునిక వెయిటింగ్ హాళ్లు, మెరుగైన లైటింగ్ వ్యవస్థ, ఎస్కలేటర్లు, లిఫ్టులు, దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు, సుందరమైన స్టేషన్ ముఖద్వారాలను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ల అభివృద్ధి ద్వారా స్థానిక ప్రాంతాల్లో వ్యాపార, ఆర్థిక కార్యకలాపాలు కూడా పుంజుకుంటాయని, డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తయితే భాగ్యనగర ప్రజలకు అత్యుత్తమ ప్రయాణ అనుభూతి లభిస్తుందని మంత్రి వెల్లడించారు.

# Cinema




మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కలయికలో ఓ క్రేజీ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ అనౌన్స్‌మెంట్ నుంచే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దీంతో ఈ చిత్రం నుంచి ఏ చిన్న అప్ డేట్ వచ్చినా క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా ఈ సినిమా గ్లింప్స్ గురించి ఓ క్రేజీ న్యూస్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. గతంలో చిత్ర యూనిట్ ప్రకటించినట్లుగా, ఎన్టీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ మూవీ ఫస్ట్ గ్లింప్స్‌ను అత్యంత గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారట. దీంతో మే 20న నందమూరి అభిమానులకు అసలైన 'మాస్ ట్రీట్' లభించనుందని సోషల్ మీడియా హోరెత్తిపోతోంది. అయితే నందమూరి అభిమానులు మే 20 వరకు వేచి చూడాల్సిన అవసరం లేకుండా, మే 19 అర్ధరాత్రికే ఈ సాలిడ్ గ్లింప్స్‌ను వదిలేందుకు ప్రశాంత్ నీల్ అండ్ టీమ్ ప్లాన్ చేస్తున్నారట. అభిమానుల్లో ఉన్న ఉత్కంఠను దృష్టిలో ఉంచుకుని, పుట్టినరోజు ముందే ఈ కానుకను అందించాలని వారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. 'కేజీఎఫ్', 'సలార్' సినిమాలతో సరికొత్త ప్రపంచాలను సృష్టించిన నీల్, ఇప్పుడు తారక్ కోసం ఎలాంటి ఊహాతీతమైన లోకాన్ని సెట్ చేశారో చూడాలని యావత్ సినీ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ గ్లింప్స్ దాదాపు మూడు నిమిషాల పాటు ఉంటుందని సినీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఈ అప్‌డేట్‌తో సోషల్ మీడియాలో ఒక్కసారిగా సందడి పెరిగింది. ముఖ్యంగా మే 18న రామ్ చరణ్ 'పెద్ది' ట్రైలర్ విడుదల కానుండటం, ఆ మరుసటి రోజే ఎన్టీఆర్ మూవీ గ్లింప్స్ రానుండటంతో టాలీవుడ్‌లో మెగా-నందమూరి ఫ్యాన్స్ హంగామా పీక్స్‌కు చేరుకుంది. వరుసగా ఇద్దరు స్టార్ హీరోల అప్‌డేట్స్ వస్తుండటంతో యూట్యూబ్ రికార్డులు తిరగరాయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.




నందమూరి నటసింహం బాలకృష్ణ , మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో ఒక భారీ చిత్రం తెరకెక్కుతున్న సంగతి మనందరికీ ఎరుకే. ఇప్పటికే ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. బాలయ్య, సముద్రఖని వంటి కీలక నటుల మధ్య ప్రధాన సన్నివేశాల చిత్రీకరణ ఇప్పటికే పూర్తయినట్లు సమాచారం.

ప్రస్తుతం ఈ సినిమా యూనిట్ ఒక ప్రత్యేకమైన ఐటెం సాంగ్ చిత్రీకరణలో బిజీగా ఉంది. సినిమా సెట్స్ నుంచి సినిమాటోగ్రాఫర్ అరవింద్ కశ్యప్ షేర్ చేసిన ఒక ఫోటో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఇది చూస్తుంటే ఈ సినిమాలో విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉండబోతున్నాయని అర్థమవుతోంది. ముఖ్యంగా బాలయ్య మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా థమన్ ఈసారి ఎలాంటి మ్యూజిక్ ఇచ్చారో అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వృద్ధి సినిమాస్ వారు ఎక్కడా రాజీ పడకుండా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలయ్య పుట్టినరోజు కానుకగా ఈ సినిమా టైటిల్‌తో పాటు ఒక అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేయబోతున్నారట. గోపీచంద్ మలినేని మార్క్ మాస్ ఎలివేషన్లు, అలాగే ఎస్.ఎస్. థమన్ ఇచ్చే పవర్‌ఫుల్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తో ఈ గ్లింప్స్ సోషల్ మీడియాను షేక్ చేయడం ఖాయమని సినీ వర్గాలు అంటున్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్టులో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తోంది. 'భగవంత్ కేసరి' వంటి సక్సెస్ ఫుల్ సినిమా తర్వాత మరోసారి వీరిద్దరూ కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం విశేషం. దీనితో పాటు మలయాళ బ్యూటీ హనీరోజ్ కూడా ఈ సినిమాలో ఒక కీలక పాత్ర పోషిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో నటీనటుల ఎంపిక విషయంలోనే సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండటం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. బాలయ్య, థమన్ కాంబినేషన్‌లో ఇప్పటివరకు వచ్చిన అఖండ, వీరసింహారెడ్డి, డాకు మహారాజ్, భగవంత్ కేసరి, అఖండ-2 వంటి సినిమాలు మ్యూజికల్ హిట్స్‌గా నిలిచాయి. ఇప్పుడు ఈ చిత్రానికి కూడా థమన్ పనిచేస్తుండటంతో, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటల విషయంలో మరోసారి మ్యాజిక్ రిపీట్ అవుతుందని అంతా భావిస్తున్నారు. బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కలయికలో గతంలో వచ్చిన 'వీరసింహారెడ్డి' బాక్సాఫీస్ వద్ద ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు అదే కాంబినేషన్ మళ్ళీ రిపీట్ అవుతుండటంతో నందమూరి అభిమానులు ఈ సినిమాపై గట్టి నమ్మకంతో ఉన్నారు. ఒక హిట్ కాంబినేషన్ తిరిగి రావడం ట్రేడ్ వర్గాల్లో కూడా మంచి బజ్ క్రియేట్ చేస్తోంది. మరి ఈ సినిమాతో బాలయ్య ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తారో చూడాలంటే మూవీ విడుదల వరకు ఎదురుచూడక తప్పదు.




రెండు తెలుగు రాష్ట్రాలలో సింగిల్ స్క్రీన్ థియేటర్లలో పర్సంటేజ్ విధానం అమలు చేయాలన్న డిమాండ్ మరోసారి తెలుగు చిత్ర పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. ఎగ్జిబిటర్స్, నిర్మాతల మధ్య జరుగుతున్న మాటల యుద్ధం ముదిరి పాకాన పడుతున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం ఎగ్జిబిటర్స్ సమావేశమై ఇకపై పర్సంటేజీ సిస్టంపైనే సినిమాలు రన్ చేస్తామని నిర్ణయం తీసుకున్నట్లు మీడియా ఎదుటే ప్రకటించారు. అయితే ఆ మరునాడే యాక్టివ్ ప్రొడ్యూసర్స్ ఓ మీటింగ్ పెట్టి ఎగ్జిబిటర్లపై సీరియస్ అవడమేగాక వ్యక్తిగతం విమర్శలు చేశారు. పెద్ది సినిమా విడుదల ఉందనే కావాలనే ఇలా పర్సంటేజీ సిస్టం అంటూ రాద్ధాంతం చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు.




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ బుచ్చి బాబు సానా కాంబోలో రూపొందుతున్న భారీ యాక్షన్ చిత్రం 'పెద్ది'. ఈ సినిమా ట్రైలర్‌కు సంబంధించి ఫ్యాన్స్ అందరూ ఎంతగా వెయిట్ చేస్తున్నారో తెలియంది కాదు. వారి ఎదురు చూపులకు తెరదించుతూ సోమవారం సాయంత్రం 'పెద్ది' ట్రైలర్‌ను మేకర్స్ వదిలారు. ఈ ట్రైలర్ సోషల్ మీడియాను షేక్ చేస్తూ దూసుకెళుతోంది. ముఖ్యంగా, ట్రైలర్‌లోని ఒక ప్రత్యేకమైన యాక్షన్ షాట్ అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. రామ్ చరణ్ అత్యంత ఉద్వేగంతో, తనదైన శైలిలో ప్రత్యర్థిపై దాడి చేస్తున్నట్లుగా ఉన్న ఈ సన్నివేశం సినిమాపై అంచనాలను భారీగా పెంచేస్తోంది. ట్రైలర్ అంతా ఒక ఎత్తు, లాస్ట్‌లో వచ్చే ఈ ట్రాన్సిషన్ షాట్ మరో ఎత్తు అనేలా ఫ్యాన్స్, నెటిజన్లు రియాక్ట్ అవుతుండటం విశేషం. క్రికెటర్ నుంచి కుస్తీ యోధుడిగా మారడం మాత్రం హైలెట్ అంటూ.. బుచ్చిబాబుపై ప్రశంసలు కురిపిస్తున్నారు. అంతేకాదు, ఈ షాట్‌కు నీకు గుడి కూడా కట్టేయవచ్చు బుచ్చి అంటూ ఫ్యాన్స్ కొందరు తమ సంతోషాన్ని తెలియజేస్తున్నారు. రామ్ చరణ్ ఇంటెన్స్ లుక్, అతని శారీరక భాష, యాక్షన్ కొరియోగ్రఫీ ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. ట్రైలర్‌లోని చాలా వరకు షాట్స్.. బుచ్చి బాబు సానా దర్శకత్వ ప్రతిభను కొనియాడేలా చేస్తున్నాయి. ఇక ఈ ట్రైలర్‌తో అంచనాలు అమాంతం రెట్టింపవుతున్నాయి. 'పెద్ది' సినిమా కచ్చితంగా టాలీవుడ్‌లో ఒక మైలురాయిగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఒక్కో పాత్రను టైటిల్‌లో రివీల్ చేసిన తీరు, రామ్ చరణ్ మేకోవర్.. అన్నీ వావ్ అనేలా ఉన్నాయి. క్రికెట్, కుస్తీ కాకుండా ట్రైలర్ చివరిలో రామ్ చరణ్ పాత్రలోని మరో కోణాన్ని దర్శకుడు పరిచయం చేశారు. ఆ పాత్ర ఈ సినిమాకు ప్రాణమనే భావనని ఈ ట్రైలర్ కలగజేస్తోంది. జూన్ 4న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలయ్యేందుకు ముస్తాబవుతోంది.




చాలా రోజులుగా 'పర్సంటేజ్ సిస్టమ్ కావాలని పలువురు ఎగ్జిబిటర్స్ భావిస్తున్నారు. ముఖ్యంగా సింగిల్ స్క్రీన్ థియేటర్స్ వారు 'పర్సంటేజ్' లేకపోతే తమ మనుగడ సాగదనీ తేల్చేశారు. అయితే 'యాక్టివ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్' లోని కొందరు నిర్మాతలు మాత్రం 'పర్సంటేజ్ సిస్టమ్' వల్ల తాము కోట్ల రూపాయలు నష్టపోతామని అంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం కోసం కూర్చుని మాట్లాడుకుందామని నిర్మాతల్లో కొందరు ఆశించారు. అయితే అటు, ఇటు వాదనల మధ్యలో ఉన్నట్టుండి విమర్శలు తలెత్తాయి. ప్రముఖ నిర్మాత నాగవంశీ మాటల్లో నోటెడ్ ఎగ్జిబిటర్ సునీల్ నారంగ్ ను టార్గెట్ చేశారని కొందరి భావన. అదే విషయాన్ని నారంగ్ ముందు పెట్టినప్పుడు దానికి ఆయన నాగవంశీపై సెటైర్స్ వేశారు. ఇలా సమస్య పరిష్కారం కోసం దారులు వెదకడం మరచి కాంట్రవర్సియల్ కామెంట్స్ చేసుకోవడం పరిశ్రమలో చర్చనీయాంశమయింది. సితార ఎంటర్ టైన్ మెంట్స్ అధినేత నాగవంశీ చెప్పక పోయినా, ఆ వందల థియేటర్ల ఎగ్జిబిటర్ సునీల్ నారంగ్ అని చిత్రసీమలో అందరికీ తెలుసు. అందువల్లే నాగవంశీపై సునీల్ నారంగ్ వ్యంగ్యంగా మాట్లాడారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే గురువారం ఎగ్జిబిటర్స్ మీడియా మీట్ ఏర్పాటు చేశారు. తామెవరినీ విమర్శించడం లేదని, పర్సంటేజ్ విధానం అమలు చేసి తమను ఆదుకోవాలనే కోరుకుంటున్నామని అన్నారు. 'పెద్ది' సినిమాను టార్గెట్ చేసి, ఈ వివాదం తీసుకు వచ్చామనడం సబబు కాదని తేల్చి చెప్పారు. ఎప్పటి నుంచో 'పర్సంటేజ్' కోసం పోరాడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. మే 15వ తేదీనే సమస్యకు తగిన పరిష్కారం దొరుకుతుందని సి.కళ్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

సి.కళ్యాణ్ ఒక్కరోజులోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అంటున్నారు. కానీ, 'పర్సంటేజ్ సిస్టమ్'పై ఎన్నో ఏళ్ళుగా ఎగ్జిబిటర్స్ అభ్యర్థిస్తూనే ఉన్నారు. 'పర్సంటేజ్ సిస్టమ్'పై ఇంత రచ్చ సాగుతున్నా, టాలీవుడ్ బిగ్ ప్రొడ్యూసర్స్ అయిన అల్లు అరవింద్, డి.సురేశ్ బాబు, దిల్ రాజ్, సి.అశ్వనీదత్ వంటివారు బయటకు రాకపోవడంపైనా సినీజనం విచారం వ్యక్తం చేస్తున్నారు. సినిమా రంగంలో కీలకమైన నిర్ణయాలు తీసుకొనే సమయంలో ఈ నలుగురు బిగ్ ప్రొడ్యూసర్స్ ముందుండేవారు. మరి ఈ సారి వారు ముందుకు రాకుండా తమ సన్నిహితులను అటు, ఇటు పంపించడం ఎంతవరకు సబబు అన్నది ప్రశ్న.

కారణాలు ఏవైనా ఈ సమ్మర్ లో సినిమా సందడి ఏ మాత్రం సాగలేదు. జూన్ 4వ తేదీన రామ్ చరణ్ 'పెద్ది' సినిమా వస్తోంది. ఓ పెద్ద సినిమా వస్తోందంటే థియేటర్స్ కళకళలాడతాయి. కాబట్టి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం దిశగా ఇటు ఎగ్జిబిటర్స్, అటు ప్రొడ్యూసర్స్ సాగాలనే టాలీవుడ్ జనం ఆశిస్తున్నారు. ఈ క్రమంలో మే 15వ తేదీనే ఛాంబర్ లో 'పర్సంటేజ్ సిస్టమ్'పై అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుందని సి. కళ్యాణ్ తెలపడం విశేషం. ఈ మాటలు ఎంతోమంది సినిమా థియేటర్స్ వారికి ఊరటనిస్తున్నాయి. మరి ఎలాంటి పరిష్కారం లభిస్తుందో చూద్దాం.




నిర్మాత ప్రసాద్ వి. పొట్లూరి గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అప్పట్లో వివాదం ఎక్కడ ఉంటే ఆయన అక్కడ ఉండేవాడు. బలుపు సినిమాతో నిర్మాతగా కెరీర్ ని మొదలుపెట్టిన పీవీఆర్ ఆ తరువాత క్షణం, ఊపిరి, బ్రహ్మోత్సవం, మహర్షి లాంటి సినిమాలను నిర్మించాడు. అయితే సడెన్ గా పీవీఆర్ ఇండస్ట్రీ నుంచి కనుమరుగయ్యాడు. ఇండస్ట్రీని ఆయన ఎందుకు వదిలేశాడు అన్న విషయం ఎవరికీ తెలియదు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పీవీఆర్ ఇండస్ట్రీ వదిలి వెళ్ళడానికి కారణం చెప్పాడు.' సినిమాను నిర్మించడమంత దారుణమైన బిజినెస్ ఇంకొకటి లేదు. మనం డబ్బు ఇచ్చి అవమానాలు పడేది కేవలం ఈ బిజినెస్ లోనే ఉంది. మనం డబ్బిచ్చి మనం పెంట వేసుకోవడం అనేది పిచ్చితనం. అందుకే నేను ఫిల్మ్ ఇండస్ట్రీని వదిలేశాను. ఇప్పుడు నిర్మాత అనేవాడు ఒక జోకర్ అయ్యిపోయాడు. సెట్ లో అందరూ నిర్మాతల మీద జోకులు వేసుకుంటున్నారు. డబ్బు పెట్టేది నిర్మాత.. సినిమా సంకనాకిపోతే రోడ్డెక్కేది నిర్మాతనే. అలాంటప్పుడు నిర్మాత అంటే ఎలా ఉండాలి. వెస్ట్రన్ స్టూడియోస్ విధానం ఇక్కడ లేదు.

OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085